

ఘనంగా ఏరువాక పౌర్ణమి



తుమ్మలపల్లిలో ఏరువాక వేడుకలు

పాడి పశువులను ముస్తాబు చేసిన రైతులు

జిల్లా వ్యాప్తంగా ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ముస్తాబు చేసిన ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఆవులు, ఎద్దులను అందంగా అలంకరించి ఫలహారం తినిపించి పూజలు చేశారు. ఏరువాక పౌర్ణమి రోజున ఆవులు, ఎద్దులను పూజిస్తే ఇంట్లో సంపద వెల్లి విరుస్తుందని రైతులు నమ్ముతారు. జిల్లేడుచౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో ఏరువాక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎడ్ల బండ్లతో ఊరేగింపు నిర్వహించి సందడి చేశారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



జిల్లేడుచౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో బండ్ల ఊరేగింపు

అందంగా ముస్తాబు చేసిన ఎడ్లతో కుటుంబ సభ్యులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
» ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



వీర్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వీర్లపల్లి, చర్ల అంతిరెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్లకు స్థానిక నాయకులతో కలసి భూమిపూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ గ్రామాల్లో పేదలకు కనీసం ఒక్క ఇళ్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. వచ్చే రోజుల్లో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో అన్ని రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ సందర్భంగా వీర్లపల్లి గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. నాయకులు జంగ నర్సింహులు, శివశంకర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, చిందం నర్సింహులు, నవాజ్‌రెడ్డి, అన్వర్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, కావలి కృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, సీతారాములు, ప్రభు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



వర్షానికి నేలకొరిగిన బొప్పాయి

మాడ్గుల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రెండు రోజులు కురిసిన వర్షానికి మండలంలోని కొల్కులపల్లి గ్రామానికి చెందిన గుమ్మడివెల్లి అచ్చమ్మ బొప్పాయి తోట నేలకూలింది. రెండెకరాల్లో కాపుకొచ్చిన దాదాపు సగం పంట పాడైపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సోలాపూర్ నుంచి ఒక్కచెట్టు రూ.200కు కొనుగోలు చేసి సాగుచేస్తే నేలపాలైందని, ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు.

సెలవులకు టాటా..

ఇక బడి బాట

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల అనంతరం పూర్తిస్థాయిలో స్కూళ్లు ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కొత్త విద్యా సంవత్సరం ఆరంభం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలను శుభ్రం చేయడంతోపాటు తరగతి గదులను అందంగా తీర్చిదిద్దారు. తరగతి గదులకు, గేట్లను మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వాగత ఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, వంట గదులను శుభ్రం చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా చేశారు.

- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- మొదటి రోజే విద్యార్థులకు యూనిఫాం, నోట్ బుక్కుల పంపిణీ
- ముమ్మరంగా పాఠశాలలకు మరమ్మతులు
- మధ్యాహ్న భోజన పథకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి





విద్యార్థులు, పాఠశాలల వివరాలు

పాఠశాలలు(ప్రభుత్వ, ప్రైవేటు)	3,203
మొత్తం విద్యార్థులు	9,50,079
అవసరమైన పాఠ్య పుస్తకాలు	9,15,620
జిల్లాకు చేరుకున్నవి	8,76,370

రంగారెడ్డి అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొత్తం 3,203 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఇందులో 9,50,079 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం బడి బాట కార్యక్రమం జరుగుతున్నందున ఈ సంఖ్య మరింత పెరగనుంది. గతేడాది ఖాళీ టీచర్ పోస్టులు భర్తీ చేయడంతో పెద్దగా టీచర్ల కొరత లేదని అధికారులు చెబుతున్నారు. స్కూళ్ల ఆరంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే అన్ని పాఠశాలలకు వీటిని పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతానికి దుస్తులు ఒక జత ఇవ్వనున్నారు. ఈవారంలో మరో జత అందజేస్తామని అధికారులు తెలిపారు. మరో వైపు స్కూల్ ప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాలు కల్పనకు విద్యాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాలల

మిగతా 8వ పేజీలో...



పాఠశాలలో మామిడి తోరణాలు కడుతున్న ఉపాధ్యాయులు

పాఠ్య పుస్తకాలు సిద్ధం : డీఈవో

పాఠశాలలు తెరిచే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసేందుకు దాదాపు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో సుశీందర్‌రావు తెలిపారు. అన్ని స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లాలో మొత్తం 3,203 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలుండగా ఇందులో 9,50,079 మంది విద్యార్థులు ఉన్నారని, పెద్దగా టీచర్ పోస్టుల కొరత లేదని తెలిపారు. నేటి నుంచి అన్ని చోట్ల బడిబాట ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో 50శాతం రాయితీ కల్పిస్తూ జిల్లా విద్యా శాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని జర్నలిస్టు సంఘాలు అభ్యర్థించిన నేపథ్యంలో డీఈఓ ఈ నిర్ణయం తీసుకున్నారు. అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ఇది వర్తింపజేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించడంపై టీయూడబ్ల్యూజే, ఐజేయూ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా యూనియన్ అధ్యక్షుడు సలీమ్ పాషా, కార్యదర్శి సత్యనారాయణలు కలెక్టర్ నారాయణరెడ్డి, డీఈఓ సుశీంధర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



గో సంరక్షణతో పాడి, పంట

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గోవుల సంరక్షణతోనే పాడి సంపదతోపాటు పంటలు పుష్కలంగా పండి ప్రజలు ఆరోగ్య జీవనం గడుపుతారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం షాద్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవుకు పూజ చేశారు. అనంతరం బక్కని నర్సింహులు నివాసంలో గోవు వృషభ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితుడు శ్రీనివాసచార్యులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

నక్ష లేక పరేషాన్

చింతకుంటపల్లి వాసుల ఇక్కట్లు

- రికార్డులకు మించి కబ్జాలో రైతులు
- గ్రామంలో తరుచూ భూ వివాదాలు
- సర్వే చేయాలని గ్రామస్తుల వినతులు

నిజాం కాలం నుంచి తప్పని ఎదురుచూపులు

కేశంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నిజాం కాలంలో భూ సర్వే చేయడానికి ఓ గ్రామానికి అధికారులు వచ్చారు. అప్పట్లో ప్లేగు వ్యాధి ప్రబలడంతో భూ సర్వే చేయకుండా వెళ్లిపోయారు. దీంతో నిలిచిపోయిన భూ సర్వే కోసం నిజాం కాలం నుంచి నేటికీ ఎదురుచూస్తున్నారు కేశంపేట మండలం చింతకుంటపల్లివాసులు. గ్రామంలో 760 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 823 మంది రైతులు సాగు చేసుకుంటున్నారు. అప్పట్లో ఆర్ఓఆర్, పహణీల రికార్డుల్లో సర్వే నంబర్ల వారీగా రైతుల భూ వివరాలు నమోదు చేశారు. నక్ష లేకపోవడంతో కొంతమంది బడా రైతులు రెవెన్యూ రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం కంటే ఎక్కువ మొత్తంలో కబ్జా చేసి సాగు చేస్తున్నారు. ఇదేంటని ఎవరైనా ప్రశ్నిస్తే

మిగతా 8వ పేజీలో...



చింతకుంటపల్లి గ్రామం

సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి



చింతకుంటపల్లి గ్రామంలో భూ సర్వే చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. రాజధానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతకుంటపల్లి గ్రామంలో భూ సర్వే, నక్షలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రికార్డుల ప్రకారం సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలి.

- అనేమోని కృష్ణ, చింతకుంపల్లి



నిఖిల్ సినిమా షూటింగ్‌లో ప్రమాదం

శంషాబాద్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నిఖిల్ నటిస్తున్న ది ఇండియన్ హౌస్ సినిమా షూటింగ్ బుధవారం శంషాబాద్ సమీపంలో జరుగుతోంది. అయితే సముద్రం సీన్స్ తీసేందుకు నిర్వాహకులు తాత్కాలికంగా భారీ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు వాటర్ ట్యాంక్ పగిలిపోవడంతో ఒక్కసారిగా వాటర్ రావడంతో కెమెరాలు, షూటింగ్ సామగ్రి నీట మునిగాయి. ఇందులో అసిస్టెంట్ కెమెరామెన్‌కు స్వల్ప గాయలయ్యాయి. ఎవరికీ పెద్ద ప్రమాదం జరగనప్పటికీ ఆర్థికంగా నష్టం జరిగిందని, సినిమా షూటింగ్‌ను కొద్దిరోజులు వాయిదా వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కష్టపడ్డ వారికే పదవుల్లో ప్రాధాన్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీలో కొత్త వారి చేరికలు ఉన్నప్పటికీ ఎంతోకాలంగా పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు పదవులు తప్పకుండా వస్తాయని.. వారికి ప్రాధాన్యం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. బుధవారం పార్టీ నియోజకవర్గ సమావేశం తుక్కుగూడలోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గంలో పదవులన్నీ భర్తీ చేయనున్నామని, కష్ట కాలంలో పార్టీకి పనిచేసిన వారికి పదవులు వస్తాయన్నారు. తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సహా అధిష్ఠానం ఆదేశానుసారం నియోజకవర్గాన్ని పార్టీపరంగా రెండు బ్లాకులుగా విభజించామని.. కందుకూరు, మహేశ్వరం మండలాలతో పాటు జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలను కలుపుకొని మొదటి బ్లాకు, జీహెచ్ఎంసీలోని సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లు, బడంగ్‌పేట్, మీర్‌పేట కార్పొరేషన్లను కలుపుకొని రెండో బ్లాకుగా విభజించామన్నారు. ఈ మేరకు బుధవారం ఉదయం 9గంటలకు తుక్కుగూడలో బ్లాక్ కాంగ్రెస్-1 సమావేశం, మధ్యాహ్నం 2గంటలకు బ్లాక్ కాంగ్రెస్-2 సమావేశం సరూర్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్‌హాలులో వరుస సమావేశాలు నిర్వహించారు. పరిశీలకులుగా శివసేనారెడ్డి, ధారాసింగ్‌లు హాజరై పార్టీ విధి విధానాలను కార్యకర్తలకు సూచించారు. పార్టీ ఆదేశాలను కాదని పైరవీలతో ఎవరు ముందుకెళ్లినా ఎలాంటి పదవులు రావనే విషయాన్ని గమనించాలన్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, చల్లా నర్సింహరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, తీగల అనితారెడ్డి, కె.రఘుమారెడ్డి, కృష్ణానాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



7

కేసారం ఓటర్లను చేవెళ్ల వార్డులో చేర్చాలి

ఎమ్మెల్యే యాదయ్యను కోరిన గ్రామస్తులు



6

దశాబ్దాల కల సాకారం.. గిరిజనుల ఆనందం

● మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగుపై వంతెన నేడు ప్రారంభం..

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో కత్వవాగుపై వంతెన నిర్మాణం పూర్తయింది. దశాబ్దాల గిరిజనుల సాకారం కాబోతుంది. ఏళ్లకాలంగా వర్షాకాలంలో పలు తండాల గిరిజనులు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. నిర్మాణం పూర్తైన వంతెన ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. గురువారం మేడిగడ్డ -శంకర్‌కొండ కత్వవాగుపై నిర్మించిన వంతెన ప్రారంభానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఉముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈమేరకు వంతెన ప్రారంభోత్సవ ఏర్పాట్లను పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అబిషేక్ బుధవారం పరిశీలించారు. కాగా, ఆమనగల్లు మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ అనితా విజయ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, విజయ్‌రాథోడ్ కోరారు.

కేసారం ఓటర్లను చేవెళ్ల వార్డులో చేర్చాలి

● ఎమ్మెల్యే యాదయ్యను కోరిన గ్రామస్తులు

చేవెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కేసారం వార్డులో ఉన్న ఓటర్లను చేవెళ్ల వార్డులో కలపాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం కేసారం మాజీ సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసానికి వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70 ఏళ్లుగా చేవెళ్లతో కేసారం గ్రామానికి మంచి అనుబంధం ఉందన్నారు. మున్సిపాలిటీలో భాగంగా తమ గ్రామం కేసారంను చేవెళ్లలోని వార్డులో కాకుండా మల్కాపూర్ వార్డులో కలుపుతామని అధికారులు చెప్పడం సరైన విధానం కాదన్నారు. కేసారం గ్రామంలోని 889 ఓటర్లను చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో కలపాలని ఎమ్మెల్యేను కోరారు. భౌగోళికంగా, నైసర్గికంగా చేవెళ్ల పట్టణంతో కేసారం కలిసి ఉందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య గ్రామస్తులు డిమాండ్ మేరకు చేవెళ్లలోనే కేసారం ఉండేలా అధికారులకు ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదాతల చూపు.. సేంద్రియ సాగు వైపు

దౌల్తాబాద్, జూన్11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకంతో భూమిలోని భూసారం దెబ్బతిని తెగుళ్లు సోకి దిగుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువుల వాడకంపై కొందరు రైతులు దృష్టిపెట్టారు. మండలంలో రైతులు తమ పంట పొలాల్లో ఇతర ప్రాంతాల నుంచి మండలానికి పశువులను తీసుకొని మేత కోసం వచ్చే పశువుల పెంపకందారులతో మాట్లాడి తమ పొలాల్లో మేకలు, గొర్రెల మందలు ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా కొందరు రైతులు ఈ ప్రాంతంలోని పశువుల పెంపకందారుల వద్ద ఎరువు కొనుగోలు చేస్తూ పొలాల్లో చల్లుతున్నారు.

పొలాలకు చెరువు మట్టి

రైతులు తమ పంట పొలాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల మట్టిని సైతం ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారు. నల్ల రేగడి మట్టి, పత్తి, కంది పంటలకు అనుకూలంగా ఉండటంతో మండలంలోని గోకఫస్లాబాద్, దేవరఫస్లాబాద్, బాలంపేట్, గుండెపల్లి తదితర గ్రామాల్లో వేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుండటంతో పాటు ఒక సంవత్సరం ఎరువు వేస్తే మూడు సంవత్సరాల వరకు పని చేస్తుండటంతో రైతులు ఎక్కువగా మేకలు, గొర్రెల ఎరువులను వాడటంపై ఆసక్తి కనబరుస్తున్నారు. సేంద్రియ ఎరువు ట్రాక్టర్ రూ.1500వరకు, అదే విధంగా సంవత్సరం లోపు కుప్ప దాదాపు రూ.15వేల వరకు గ్రామాల్లో అందుబాటులో ఉంటుంది.



దేవరఫస్లాబాద్‌లో పంట పొలంలో రైతు వేసిన చెరువు మట్టి

భూమి సారవంతం

సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారవంతం అవుతుంది. పంట దిగుబడి సైతం పెరుగుతుంది. సేంద్రియ ఎరువు ఒక్కసారి వేస్తే పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలి.

- వెంకటప్ప, రైతు, దేవరఫస్లాబాద్



ఏసీపీ కిషన్‌కు చెక్కు ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి

సీసీ కెమెరాల ఏర్పాటుకు భారీ విరాళం

చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా పని చేస్తాయని చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు. బుదవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్‌లకు చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.16 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీ పట్టణ కేంద్రంతోపాటు అన్ని వార్డులు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి ముందుకురావడం అభినందనీయమన్నారు. మల్కాపూర్ గేట్ నుంచి బీజాపూర్ రహదారిపై దామరిగిద్ద గేట్, వరకు, షాబాద్ చౌరస్తా మీదుగా దేవుని ఎర్రవల్లి గేట్ వరకు శంకర్‌పల్లి రోడ్డుపై కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జె.లక్ష్మారెడ్డి, మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ ఎం.మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎన్.కృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కడ్తాల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల వయస్సు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో శాంతిరేఖ తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో ఈనెల 10 నుంచి 17 వరకు అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పలు కాలనీల్లో పర్యటించి మూడేళ్లలోపు చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఎంపీడీవో సుజాత, సీడీపీవో సుజాతలు పాల్గొని అవగాహన కల్పించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజ్ శబరి, ఏఎన్‌ఎం పుష్ప, కార్యదర్శి అల్లాజీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిన్నారులకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న సీడీపీవో శాంతిరేఖ

మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు



లోక్ అదాలత్‌లో రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్ తదితరులు

చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేయొద్దని రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరంగా నేరం అవుతుందన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొత్తం 76 కేసులు పరిష్కరించి రూ.1,57,500 జరిమనా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, ట్రాఫిక్ పోలీస్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

స్నేహితుడి బర్త్‌డేకు వెళ్లి
రైలు పట్టాలపై శవమై..

●బాలుడిని హత్య చేసి ఉండొచ్చని అనుమానాలు



శాంతుకుమార్ (ఫైల్)

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బర్త్‌డే పార్టీ కోసం వెళ్లిన ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో కర్ణాటక రాష్ట్రం సేడం రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై బుధవారం శవమై కనిపించాడు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామంలో కలకలం రేపుతోంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మైల్వార్ గ్రామానికి చెందిన అంజమ్మ కుమారుడు శాంతుకుమార్(16) గతంలో రెండు సార్లు పదో తరగతి ఫెయిల్ కాగా, ఇటీవల పరీక్ష రాశాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన స్నేహితుడితో పాటు, సమీపంలోని కంసాన్‌పల్లి(బి) గ్రామానికి చెందిన మరి కొందరి స్నేహితులను కలిసి ఆ గ్రామానికి చెందిన మరో మిత్రుడి బర్త్‌డే ఏర్పాట్లలో మునిగినట్లు తెలుస్తోంది. సాయంత్రం వరకు పరిసరాల్లో స్నేహితులతో కలిసి మోటార్ బైక్‌పై తిరిగిన శాంతుకుమార్ రాత్రికి ఇంటికి రాలేదు. అయితే ఆ రాత్రి స్నేహితులతో కలిసి గ్రామ సరిహద్దు ప్రాంతమైన కర్ణాటకలోని హస్నాబాద్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏం జరిగిందో కానీ సేడం రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై శాంతుకుమార్ శవమై కనిపించాడు. బుధవారం ఉదయం రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద సెల్‌ఫోన్ ఆధారంగా ఫోన్ చేయగా మైల్వార్‌లోని తల్లికి సమాచారం తెలిసింది. వెంటనే గ్రామ పెద్దలతో కలిసి తల్లి అంజమ్మ, సమీప బంధువులు ఘటన జరిగిన ప్రాంతం వద్దకు వెళ్లారు. స్నేహితులతో కలిసి వెళ్లిన శాంతుకుమార్ కర్ణాటక ప్రాంతంలో అనుమానస్పదంగా శవమై కనిపించడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్నేహితుల మధ్య ఎదైనా గొడవ జరిగి శాంతుకుమార్‌ను హత్య చేశారా? అనంతరం రైల్వే ప్రమాదంగా చిత్రీకరించేందుకు పట్టాలపై పడేశారా? అన్న కోణంలో అక్కడి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మృతుడి తలకు బలమైన రక్త గాయమైనట్లుగా కుటుంబీకులు వాపోతున్నారు. సేడం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గుల్బర్గా జిల్లా కేంద్రం మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. కాగా రైల్వే పోలీసులు, స్థానిక సివిల్ పోలీసుల సమన్వయంతో ఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి విచారించినట్లు సమాచారం. అయితే మృతుడు శాంతుకుమార్ మోటార్‌బైకు కూడా ఘటన స్థలం వద్ద కనిపించలేదని సంబంధీకులు తెలిపారు. మృతుడు శాంతుకుమార్ తండ్రిమున్నప్ప మూడునెలల కిందట మృతి చెందాడు.

పాఠశాల స్థలాన్ని రక్షించాలి

కడ్తాల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భూములను రక్షించాలని ప్రభుత్వాన్ని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ ముంతాజ్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. సర్వేనెంబర్ 65/1, 65/2 సుమారు 3 ఎకరాల భూమి ఉంది. పాఠశాల స్థలాన్ని గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్థలాన్ని పరిశీలించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ తెలిపినట్లు జంగయ్య పేర్కొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హెచ్‌ఎం జంగయ్య


విద్యార్థులను అభినందిస్తున్న సుధీర్

విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్

వికారాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):2025-26 విద్యా సంవత్సరానికి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ(క్రీడా పాఠశాలలో) కాయకింగ్, కేనోయింగ్, ఫెన్సింగ్ మొదలైన క్రీడల్లో అడ్మిషన్లకు జిల్లా నుంచి ఎంపికైన 9 మంది ఎస్టీ విద్యార్థులను అదనపు కలెక్టర్ సుధీర్ అభినందించారు. చదువుతో పాటు క్రీడలో శిక్షణ పొంది వాటర్ స్పోర్ట్స్‌లో జాతీయ స్థాయిలో బహుమతులు గెలవాలని ఆకాంక్షించారు. టీటీడీవో కమలాకర్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలి

షాద్‌నగర్ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణ సాధ్యమైనట్లు తెలిపారు. వర్గీకరణ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. పిల్లలకు చదువు ముఖ్యమని.. భవిష్యత్తులో అదే ఆస్తి అని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు, నాయకులు పాండు, కృష్ణ, లింగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సేవలందించాలని గురునానక్ యూనివర్సిటీ రెక్టార్ డా.కలైరాసన్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని గురునానక్ విద్యాసంస్థల్లో స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గురునానక్ హెమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 400 మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ డైరెక్టర్ డా.రషీద్ హరూన్, హోమియోపతి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.రేణుక, గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డా.హెచ్.ఎస్ సైనీ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కేశంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 98లో మూడెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని.. కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామస్థులు బుధవారం డీటీ గీతకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై 10 రోజుల క్రితం ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసిఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు సహకారం అందించిన కాంగ్రెస్ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, విచారణ నిమిత్తం ఆర్ఐని పంపినట్లు డీటీ వివరించారు. గ్రామ యువకుల పోచమోని రమేష్, పల్లెమోని నవీన్, నరేష్, వినోద్, మల్లేష్ యాదవ్, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొమురయ్య

యోగా డేను ఘనంగా నిర్వహించాలి

కేశంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న యోగా డేను ఘనంగా నిర్వహించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ కొమురయ్య పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షురాలు రొల్ల రాధిక ఆధ్వర్యంలో కేశంపేట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొమురయ్య హాజరై మాట్లాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ నెల 23న తల్లికి వందనం పేరిట ప్రతీ బూత్‌లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రొల్ల రఘురాములు గౌడ్, మోటే శ్రీనివాస్, మధుసూదన్ గౌడ్, నరసింహ, వెంకటేష్, శ్రీనివాస్, కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, రమేష్, నరేష్, నర్సింగ్, మహేష్, భక్తవత్సల, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

జీపీల్లో ఆర్థిక ఇబ్బందులు తొలగించాలి

చేవెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సరిపడా నిధులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం మండలంలోని 25 గ్రామ పంచాయతీ కార్యదర్శులందరూ కలిసి తమ గ్రామ పంచాయతీలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చేవెళ్ల ఎంపీవో విఠలేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. కార్యదర్శులు శివ, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, శివ కుమార్, శ్రీనివాస్, కరుణాకర్, రాజ్‌కుమార్ , భాస్కర్, దేవాదాస్, నరేందర్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

యాచారం/చౌదరిగూడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు యాచారం మండలం నానక్‌నగర్‌లో బుధవారం పలు కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని గ్రామస్థులకు సూచించారు. సీడీపీవో వినితా దేవి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మోహన్, తదితరులున్నారు. రెండున్నరేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జోత్స్న తెలిపారు. కొందుర్గు మండల పరిధిలోని ఉత్తరాసపల్లి, భైరంపల్లి, పులుసుమామిడి, సోమారంపహాడ్, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట్ తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలో అమ్మమాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

నిలిచిన బర్త్ సర్టిఫికెట్ల జారీ

- ఐదు రోజులుగా ఆగిన సేవలు

తాండూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచింది. ఐదు రోజులుగా సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీలో వెబ్‌సైట్‌లో సమస్యలు తలెత్తాయి. మీసేవ కేంద్రాల్లో రెండు రోజులుగా సమస్యలు వస్తున్నాయి. పాఠశాలల్లో చేరేందుకు, ఉన్నత విద్యకు, ఆధార్‌కార్డుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి కావ డంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే డెత్ సర్టిఫికెట్లు కూడా జారీ కావడం లేదు. మున్సిపాలిటీలో 100కుపైగా బర్త్, 50వరకు డెత్ సర్టిఫికెట్ల జారీ నిలిచింది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోనూ సేవలు నిలిచాయి. కొన్నింటికి గడువు కూడా దాటింది. ప్రజలు సర్టిఫికెట్ల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందిస్తూ రాష్ట్రస్థాయిలోనే సర్వర్ డౌన్ ఉందని, ఒకటెండ్రు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం కింద ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని 167 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. బుధవారం ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతూ మంజూరైన కుట్టు కిషన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగుపై రూ.3.10 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రూ. 500 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనితావిజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కేఎన్ఆర్ యువసేన నాయకుడు బాబా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మహేశ్వరం సీఐపై చర్యలు తీసుకోవాలి

- నాగారం ముస్లిం నాయకులు
- యువకులపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపణ
- బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామాకు సిద్ధం!


మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

మహేశ్వరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హిందూ-ముస్లింలు ప్రశాంతంగా జీవిస్తున్న నాగారం గ్రామంలో కొందరు బీజేపీ నాయకులు మత ఘర్షణలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని, అందులో భాగంగానే సోషల్‌మీడియా వేదికగా కొందరు ముస్లిం యువకులను మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారని.. అక్రమ కేసులు బనాయించిన సీఐపై చర్యలు తీసుకోవాలని నాగారం ముస్లిం సొసైటీ నాయకులు లతీఫ్‌ఖాన్, కమాల్‌ఖాన్, షాఫుద్దీన్, ఉస్మాన్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గ్రామంలో సమావేశమై మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గ్రామంలో ఎద్దును కోసుకోవడంతో దాన్ని కొందరు బీజేపీ నాయకులు గోమాతగా వక్రీకరించారని, ముస్లింలు గోమాతను కోశారని తప్పుడు ప్రచారం చేయడంతో పాటు కొందరు ముస్లిం యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. గ్రామంలో కోసింది గోమాత కాదని.. ఎద్దు అని సాక్ష్యాధారాలు చూపించినా మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ముస్లిం యువకులపై కేసులు నమోదు చేశారన్నారు. ఈ విషయంలో ముస్లిం మతస్తులను పరుష పదజాలంలో దూషించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తీసుకోకుండా.. తమ పైనే కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సీఐపై తగిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను కలుస్తామన్నారు. అదేవిధంగా నాగారంలోని ముస్లింలందరూ దాదాపుగా బీఆర్ఎస్ పార్టీకి చెందినవారమేనని.. అయినా మా బాధలు ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పట్టించుకోలేదని.. అందుకు మేమందరం మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడానికి సిద్ధమయ్యామన్నారు. మహేశ్వరం సీఐపై తగిన చర్యలు తీసుకునేలా త్వరలో రాచకొండ కమిషనర్‌ను కలువనున్నట్లు తెలిపారు. నాయకులు ఇబ్రహీం, ఫిరోజ్‌ఖాన్, అహ్మద్, నసీర్, ఇమ్రాన్‌ఖాన్, మహ్మద్, చాంద్‌పాషా, అన్వర్‌ఖాన్, అమీరుద్దీన్ తధితరులు పాల్గొన్నారు.

'జయపురి లేఅవుట్‌పై న్యాయ పోరాటం'

ఘట్‌కేసర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి జయపురి కాలనీ భూ వివాదంపై పోరాడుతున్న తనను మీడియా పేరుతో ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని ఘట్‌కేసర్ సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వే నంబర్లు 559, 563, 564, 565, 566లలోని 68ఎకరాల భూమిని 1968లో ముస్లింల నుంచి నర్సింహరావు, చంద్రశేఖర్‌లు ఎన్‌రావుఅండ్‌రావు కంపనీకి అప్పగించారన్నారు. 56 ఎకరాలను 1969లో లేఅవుట్ చేశారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్లాట్లు అమ్ముడుపోవడం లేదని తిరిగి సాగు భూమిగా మార్చి చంద్రశేఖర్ 21.23ఎకరాలు, నర్సింహరావు 21.23 ఎకరాలను పట్టా చేసుకున్నారని తెలిపారు. చంద్రశేఖర్ తన భమిని, నర్సింహరావు భూమిని భగవాన్‌కు అగ్రిమెంట్ చేశాడన్నారు. దీంతో నర్సింహరావు 2003లో ఇన్‌జంక్షన్ ఆర్డర్ తేగా 2005లో ఆర్డర్ వెకేట్ అయ్యిందన్నారు. అయినా చంద్రశేఖర్, భగవాన్‌లు ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. తాను నర్సింహరావు తరఫున పోరాటం సాగిస్తుంటే సోమయ్య, రామారావు మీడియా ప్రతినిధుల పేటిర బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తాము న్యాయపోరాటం చేస్తామన్నారు.


యూరియా కోసం క్యూలో రైతులు

యూరియా కోసం రైతుల ఇబ్బందులు

మర్పల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వానకాలం ప్రారంభంలోనే యూరియా కొరతతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. మండలానికి పూర్తిస్థాయిలో యూరియా సరఫరా కావడం లేదు. మనగ్రోమోర్ 120క్వింటాళ్ల యూరియా రాగా బుధవారం రైతులు కొనుగోలు చేశారు. ఎకరాకు ఒక్క బస్తనే ఇస్తున్నారు. అది సరిపోదని మూడు బస్తాలైనా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఎకరానికి ఒక్క బస్తా కంటే ఎక్కువ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఫర్టిలైజర్స్ నిర్వాహకులు బ్లాక్‌లో అమ్మేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి


వికారాబాద్ పట్టణ బీజేపీ కార్యవర్గం

వికారాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 11ఏళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించే బాధ్యత ప్రతీ బీజేపీ కార్యకర్తపై పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లో పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష ఆధ్వర్యంలో కార్యవర్గాన్నా ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యవర్గం సమష్టిగా కృషిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వికారాబాద్‌లో స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యక్షులు బక్క విజయలక్ష్మి, అశోక్‌కుమార్, లక్ష్మారెడ్డి, భాస్కరచారి, ప్రధాన కార్యదర్శులు ఉప్పు అమర్‌నాథ్, వెంకట్, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్, సువానీ, బాలలింగం, ప్రీతంగౌడ్, కోశాధికారి మామిడి రాంమోహన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కేపీ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, సతీష్, నరోత్తంరెడ్డి, శ్రీకాంత్, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి


మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 11ఏళ్ల ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచిందన్నారు. రోడ్లు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారని అన్నారు. దేశంలో 59వేల కిలోమీటర్ల రోడ్లు, 37,500 కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేశారని వివరించారు. దేశంలో 141కోట్ల మందికి ఆధార్‌కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. రోజూ 60కోట్ల యూపీఐ లావాదేవీలు జగుతున్నాయంటే సాంకేతిక రంగంలో దేశం ఎంత వేగంగా ముందుకు వెళ్తోందో తెలుస్తోందన్నారు.

మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సూపరింటెండెంట్ పోస్ట్

తాండూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రికి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సూపరింటెండెంట్లను నియమిస్తూ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గత సూపరిండెంట్ డాక్టర్ రవిశంకర్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో కొత్తగా ఆర్థోసివిల్ సర్జన్ జి.వినయ్‌ను సూపరిండెంట్‌గా నియమించారు. అయితే మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి, జిల్లా ఆస్పత్రికి ఒక్క సూపరింటెండెంటే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి కూడా గైనిక్ సివిల్ సర్జన్ డాక్టర్ సునీతను సూపరింటెండెంట్‌గా నియమించారు. కాగా రెండు ఆస్పత్రులకూ ఇప్పటికే ఆర్ఎంఓలు ఉన్నారు. జిల్లా ఆస్పత్రికి ఆర్ఎంవోగా ఆనంద్‌కుమార్‌రెడ్డి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంఓగా అనిల్‌కుమార్ ఉన్నారు.


పల్లకీసేవలో కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి

ముగిసిన కొత్లాపూర్ ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్‌లో రేణుక ఎల్లమ్మ జాతర ముగిసింది. మే 12న ప్రారంభమైన జాతర బుధవారం ముగిసింది. మంగళవారాలు, శుక్రవారాల్లో భక్తులు వేలాదిగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పునర్నిర్మాణ దాత, కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు పూజా కార్యక్రమాలు జరిపించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రధానంగా గుల్బర్గ, బీదర్, సంగారెడ్డి, హైదరాబాద్, చించెల్లి ప్రాంతాల నుంచి భక్తులు తరలొచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, పూజారి శ్రీనివాస్, రవి పర్యవేక్షించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అవాంఛనీయ సంఘటనలు సిబ్బందిని నియమించారు. నాయకులు సందీప్‌రెడ్డి, బస్సురెడ్డి, సాయిలు, గోపాల్, వెంకట్‌రాంరెడ్డి, జయదీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బైండ్ల రాజు, లాలయ్యగౌడ్, లల్లానాయక్, శాంతప్ప, చెవిటి లక్ష్మ, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి


ఎరువులు కొన్న రైతులకు రశీదు ఇవ్వాలి


పెద్దేముల్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ

పెద్దే ముల్/ యాలాల, జూన్11(ఆంధ్రజ్యోతి): ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణదారులు బిల్లులు తప్పక ఇవ్వాలని ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. లైసెన్స్ నంబర్ కలిగిన బిల్లులే ఇవ్వాలని చెప్పారు. పెద్దేముల్ రైతువేదికలో బుధవారం విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అంతుకు ముందు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. దుకాణం వద్ద స్టాక్‌బోర్డు పెట్టాలని ఏవో పవన్‌ప్రీతమ్ తెలిపారు. యాలాల రైతు వేదికలో ఏడీఏ మాట్లాడుతూ.. ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ రేటుకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో శ్వేతారాణి మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలే విక్రయించాలని సూచించారు.

మరియా ఫీడ్ కంపెనీ సీజ్

ధారూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): దోర్నాలలో ఉన్న మరియా ఫీడ్ కంపెనీని బుధవారం తహసీల్దార్ సాజీదాబేగం సీజ్ చేశారు. ఈ కంపెనీలో ఎముకలతో నూనె తయారీ చేస్తున్నారని మంగళవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నివేదిక వచ్చేంత కంపెనీ నడపొద్దని చెప్పారు. కార్యక్రమంలో డీటీ విజయేందర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పదిశాతం ఇళ్లను స్థానికులకు కేటాయించాలి


మాట్లాడుతున్న కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాంపల్లిలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 10శాతం స్థానికులకు ఇవ్వాలని మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాగారంలో మాట్లాడుతూ.. రాంపల్లిలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సమయంలో స్థానికులకు పది శాతం కేటాయిస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. రాంపల్లిలో నర్మించిన 6,200 ఇళ్లల్లో 620 స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పౌర సరఫరాల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి

కీసర, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాశాల అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కీసర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వచ్చే శుక్రవారం లోపు కొనుగోళ్లను అప్‌డేట్ చేయాలన్నారు. వానాకాలం వచ్చినందును వారంలోగా కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 34వేల బస్తాల కొని 171మంది రైతులకు డబ్బు బదిలీ చేశామని కేంద్రం నిర్వహకులు వెంటక్‌రెడ్డికి తెలిపారు. ఆయనతో సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది నరహరి, మహ్మద్ ఉన్నారు.

మైల్వార్ రోడ్డుకు మహర్దశ

- రూ.38లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం


కొనసాగుతున్న బషీరాబాద్-మైల్వార్ డబుల్ రోడ్డు పనులు

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-మైల్వార్ ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరమయ్యాయి. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి వెళ్తున్న జాతీయ రహదారిని అనుసంధానిస్తూ బషీరాబాద్ వరకు నాలుగు లేన్ల రోడ్డును మైల్వార్ వరకు విస్తరిస్తున్నారు. రోడ్డు వెడల్పుతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ సింగిల్ రోడ్డుతో ఇబ్బందులకు గురవుతున్నాయని, విస్తరణతో ఇబ్బందులు తీరడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


గురుదోట్లలో ప్రదర్శన చేస్తున్న శాస్త్రవేత్తలు, స్థానికులు

విత్తనశుద్ధి చేసుకునే విత్తుకోవాలి

ధారూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి చేసిన తర్వాతనే విత్తుకోవాలని నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త అలివేలు తెలిపారు. బుధవారం గురుదోట్ల, అంపల్లిల్లో విత్తనశుద్ధిపై రైతులకు అవగహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ట్రైకోడెర్మా 10 గ్రాముల మందును కిలో విత్తనాలకు కలపాలన్నారు. రైజోబియం భూమిలో కలపడం వల్ల భూమిసారం పెరుగుతుందని శాస్త్రవేత్త శంకరిమీనా తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ పుష్ప, ఝాన్సీ, పూజిత, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన



- ఎంఈవో అంగోర్‌నాయక్, కొత్తూర్

ఫేస్ టూ ఫేస్

కొత్తూర్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభానికి సిద్ధమయ్యాయి. విద్యాభివృద్ధి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాఠశాలలు నేటి నుంచి తెరుచుకుంటుండటంతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దాంతో అధికారులు పనుల్లో నిమగ్నమైనారు. ఈ సందర్భంగా కొత్తూర్ ఎంఈవో అంగోర్‌నాయక్ 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఎప్పటి వరకు అందిస్తారు?

జవాబు : కొత్తూర్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు పంపించాం. యూనిఫాం కూడా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చేరవేశాం.

ప్రశ్న: పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఎప్పటినుంచి అందిస్తారు?

జవాబు : నేటి(గురువారం) నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయి. ఈ రోజు నుంచే పాఠ్యపుస్తకాలతో పాటు, యూనిఫాం అందించి క్లాసులు ప్రారంభించేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నాం.

ప్రశ్న: మండలంలో ఎంతమంది విద్యార్థులకు యూనిఫాం అందించనున్నారు?

జవాబు : ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన దాదాపు 2,800 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేస్తాం.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : మండలంలో బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ర్యాలీలు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నాం. అంగన్‌వాడీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించాం. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

సెలవులకు టాటా..
ఇక బడి బాట

(ఐదో పేజీ తరువాయి)

కమిటీలకు అప్పగించారు. పాఠశాలల్లో తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు, తలుపులు, కిటికీల ఏర్పాటు, గదుల మరమ్మతులు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణను కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. రూ.25 వేల విలువైన పనులను ఎమర్జెన్సీ ఫండ్ కింద జారీ చేశారు. రూ.లక్ష వరకు జరుగుతున్న పనులను గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పరిశీలిస్తున్నారు. లక్షకు పైగా వ్యయంతో చేపట్టే పనులకు కలెక్టర్ ఆధ్వర్యంలో నిధులు చెల్లిస్తున్నారు. జిల్లాలో 761 పాఠశాలలకు 22.30 కోట్లు మంజూరుకాగా 416స్కూళ్లలో మరమ్మతు పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం రూ.83.09 కోట్లు విడుదలయ్యాయి. ఇప్పటివరకు 416స్కూళ్లలో పనులు పూర్తికాగా రూ.8.30 కోట్లు విడుదలయ్యాయి.

యూనిఫాం రెడీ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాలు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం కుట్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం కుట్టడం పూర్తయ్యింది. 2025-26 సంవత్సరానికి కుట్టు పనిని పూర్తిగా మహిళా సంఘాలకు అప్పగించారు. ఒక్కో విద్యార్థికి ఒక జత యూనిఫాం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థల, కస్తూర్బా, తెలంగాణ మోడల్ పాఠశాలలు కలుపుకుని 1,341 ఉన్నాయి. 1,38,969 విద్యార్థుల కోసం 5,94,751 మీటర్ల వస్త్రం ఇప్పటికే జిల్లాకు చేరుకుంది. మొదటి విడతలో ప్యాంటు వస్త్రం మాత్రమే రాగా, స్వయం సహాయక సంఘాల మహిళలకు కుట్టేందుకు అప్పగించారు. మిగతా వస్త్రం వచ్చేలోగా ప్యాంట్ల తయారీ పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలో మొత్తం ఐదు సెంటర్లలో మేడిపల్లి, యాచారం, మాల్, గుంగల్, నందివనపర్తిలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టు పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటివరకు 8 నుంచి 12వ తరగతి బాలురకు మాత్రమే యూనిఫాం కింద ప్యాంటు అందించే వారు. ఈసారి 6, 7 తరగతుల బాలురకు నిక్కరు కాకుండా ప్యాంటు అందించనున్నారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం

పాఠశాలలు తెరిచే రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 9,15,620 పుస్తకాలు రావాల్సి ఉండగా, ప్రస్తుతం 8,76,370 పుస్తకాలు వచ్చాయి. 95.70 శాతం పుస్తకాలు జిల్లాకు చేరగా 7,46,576 పుస్తకాలను మండలాలకు పంపిణీ చేశారు. 82.20 శాతం పుస్తకాలు పంపిణీ చేశారు.

ఈసారి స్కావెంజర్లు ఎలా?

స్కూళ్లలో స్కావెంజర్లు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణపై ఏర్పడిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2024జూలై నుంచి 2025ఏప్రిల్ వరకు స్కావెంజర్లను ఏర్పాటు చేసింది. విద్యార్థుల సంఖ్యను బట్టి స్కావెంజర్‌కు నెలకు రూ.8వేల నుంచి రూ.10వేలు చెల్లించేవారు. 2025-26 విద్యా సంవత్సరంలో స్కావెంజర్ల ఏర్పాటు విషయంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ, స్కావెంజర్లకు పారిశుధ్య నిర్వహణపై ఒకరోజు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం స్కావెంజర్లను కొనసాగించాలని హెచ్ఎంలు కోరుతున్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



చౌదరిగూడ : కొందుర్గు బైరంపల్లిలో ఎద్దుల బండ్ల ఊరేగింపు



చేవెళ్ల : అలంకరించిన ఎద్దులతో రైతు

చౌదరిగూడ/షాబాద్/చేవెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. బుధవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతులు ఎద్దులను, ఎడ్ల బండ్లను మామిడి తోరణాలు, రంగులతో ప్రత్యేకంగా అలకరించి గ్రామ దేవతలకు ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు కష్టకాలం అధిగమించి, కరువుల బారి నుంచి బయటపడి సుభిక్షంగా ఉండాలని షాబాద్ మండలంలోని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాడెద్దులను రంగులతో అలంకరించారు. అనంతరం పొలంలో రైతులు, మహిళలు నాగళ్లు, గుంటకలతో భూమిని చదును చేస్తూ విత్తనాలు నాటారు. చేవెళ్ల మండలంలోని గ్రామాల్లో కాడెడ్లు, ట్రాక్టర్లను పూలు, రంగులతో అలంకరించి ఊరేగించారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లోని గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని ఘనంగా రైతులు నిర్వహించారు. అనంతరం పొలాల్లో నాగళ్లు, గుంటకలతో దమ్ము చేశారు. చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఎద్దుల బండ్లతో రైతుల ర్యాలీ నిర్వహించారు.



షాబాద్ : కాడెద్దులతో చర్లగూడ గ్రామ రైతులు

భూ సమస్యల పరిష్కారానికి కృషి



ఆమనగల్లు : ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలం సింగంపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్డీవో సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. తహసీల్దార్ లలిత సదస్సుకు అధ్యక్షత వహించారు. ఆర్ఐ సంపత్ కుమార్, సిబ్బంది మాజీ ఎంపీటీసీ శ్రీను, నాయకులు పాల్గొన్నారు. కాగా, పోలెపల్లిలోని రైతు వేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు తహసీల్దార్ లలిత అధ్యక్షత వహించారు. ఆర్ఐ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కడ్తాల్ : టాక్‌రాజ్‌గూడలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ముంతాజ్, డీటీ ఆదిత్యలు రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఆదిభట్ల : భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆదిభట్ల మున్సిపల్ కొంగరకలాన్, ఫిరోజ్‌గూడలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అధికారులు ముస్తఫా, సూర్య, విష్ణు, కృష్ణ పాల్గొన్నారు.

కొత్తూర్ : రెవెన్యూ సదస్సులు కొత్తూర్ మండలంలో ముగిశాయి. కొత్తూర్ మున్సిపాలిటీ, మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 320 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

మొయినాబాద్ రూరల్ : పెద్దమంగళారం అనుబంధ గ్రామం చిన్నషాపూర్‌లో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ గౌతమ్ కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. రెవెన్యూ సిబ్బంది రైతులున్నారు.

షాబాద్ : హైతాబాద్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అన్వర్‌తో కలిసి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామియాపటేల్, నాయకులు అత్తిల్లి శ్రీనివాస్‌రెడ్డి, జానీ, శ్రీరాములు, చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నక్ష లేక పరేషాన్

(ఐదో పేజీ తరువాయి)

నక్ష తీసుకవచ్చి సర్వే చేయాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు.

గ్రామానికి నక్ష లేక పోవడంతో భూ సంబంధిత వివాదాలు ఎక్కువయ్యాయి. బడా రైతులు ఎక్కువ భూమిని కబ్జా చేసి దున్నుకుంటున్నారు. చిన్న రైతులకు రికార్డుల్లో ఉన్న భూమి కన్నా తక్కువగా ఉన్నా ప్రశ్నించలేకపోతున్నారు. ఇలా తరుచు రైతుల మధ్యలో ఘర్షణలు జరుగున్నాయి. గత ప్రభుత్వాలు రైతులకు అసైన్డ్ చేసిన భూముల విస్తీర్ణంలో ఎక్కువ, తక్కువలు ఉన్నాయి. చింతకుంటపల్లిలో భూ సమస్యలు పరిష్కారం కావాలంటే భూసర్వే ఒక్కటే మార్గం.

నక్షలేక భూ వివాదాలు

గ్రామానికి నక్ష లేక పోవడాన్ని అదునుగా చేసుకున్న కొందరు రైతులు తరుచు భూ వివాదాలు సృష్టిస్తున్నారు. సర్వే నంబర్ ఒక దగ్గర ఉంటే మరో దగ్గర ఉందని చెప్పి కబ్జాలను మారుస్తున్నారు. అవసరం ఉండి భూమి అమ్ముకోవాలని చూస్తే వారికి కొందరు రైతులు చుక్కలు చూపిస్తున్నారు. మరికొందరు తమకు ఒక దగ్గర పొలం ఉంటే మరో దగ్గర కబ్జాలో ఉంటున్నారు. దీంతో భూమిని కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది.

ఇప్పటికైనా పరిష్కారం దొరికేనా?

కాంగ్రెస్ ప్రభుత్వంలో చింతకుంటపల్లి భూ సర్వేకి పరిష్కారం దొరికేనా? అని రైతులు మదన పడుతున్నారు. గత ప్రభుత్వంలో సర్వే కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. రాష్ట్రంలో 413 గ్రామాలకు సర్వే రికార్డులు లేవని ప్రభుత్వం గుర్తించింది. ఇందులో ఐదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి సర్వే చేయనున్నారు. దీతో చింతకుంటపల్లి రైతుల్లో ఆశలు చిగురించాయి. తమ గ్రామంలో కూడా సర్వే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి

చింతకుంటపల్లిలో భూసర్వే చేయాలని రైతులు ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాలు సమర్పించారు. ఎంపీ, ఎమ్మెల్యేలచే ప్రభుత్వానికి రికమండ్ చేయించారు. ఇదే సమస్యపై ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి శాసన మండలిలో ప్రస్తావించారు. అయినా గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టులో ఎంపిక చేయకపోవడంపై గ్రామస్తులు అసహనానికి గురవుతున్నారు.

చింతకుంటపల్లిని ఎంపిక చేయాలి



కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలు తీర్చడానికి ఎంతో కృషి చేస్తుంది. నిజాం కాలం నుంచి భూ సర్వే కోసం ఎదురు చూస్తున్నం. మా గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టులో గుర్తించి సర్వే చేయాలి. సర్వేతో రైతుల సమస్యలు దాదాపు పరిష్కారం అవుతాయి.

- పోచమోని రమేష్, చింతకుంటపల్లి

సర్వే కమిషనర్‌కి నివేదక ఇచ్చాం



చింత కుంట పల్లి గ్రామానికి భూ నక్ష లేదని, సర్వే చేయాలని భూ సర్వే కమిషనర్‌కు గతంలో నివేదిక అందించాం. భూ భారతిలో నక్ష సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. జూన్ 2 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం చింతకుంటపల్లిలో సదస్సు నిర్వహిస్తాం.

- అజాంఅలీ, తహసీల్దార్, కేశంపేట

మంత్రి వివేక్ వెంకటస్వామికి శుభాకాంక్షల వెల్లువ



షాబాద్ : మంత్రి వివేక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆంజనేయులు తదితరులు

షాబాద్/షాద్‌నగర్‌రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేగరి రాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు మహేష్, శేఖర్ తదితరులున్నారు. అలాగే వివేక్ వెంకటస్వామిని షాద్‌నగర్ దళిత సంఘాల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుచ్చయ్య, రామ్మూర్తి, రాంచందర్, రఘురాం, విష్ణుమూర్తి, బాల్‌రాజ్, మహేష్, క్రాంతి ఉన్నారు.

ఏనుగు జంగారెడ్డికి నాయకుల సన్మానం

కందుకూరు : పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఏనుగు జంగారెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. విఘ్నేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, దేవేందర్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్ ఉన్నారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శికి..

శంషాబాద్ రూరల్ : పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన వేణుగౌడ్, ప్రధాన కార్యదర్శులు సానేం శ్రీనివాస్‌గౌడ్, సదాలక్ష్మిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ సన్మానించారు. బుధవారం రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ నరేందర్‌తో కలిసి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్ కాంటెస్టెడ్ జడ్పీటీసీ విజయ, నాయకులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

షాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో మండలాధ్యక్షుడు మద్దూరి మాణెయ్య అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాల ముగిసిన సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తిరిగి చెప్పాలన్నారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామన్నారు. జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సతీష్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కిరణ్, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, ప్రధానకార్యదర్శి హరీష్, బీజేవైఎం మండలాధ్యక్షుడు మహేష్, ఎస్సీమోర్చా అధ్యక్షుడు మహేందర్, నాయకులున్నారు.

శంకర్‌కొండ తండాకు 'గిరిజన భవన్'

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్‌కొండ తండాకు గిరిజన భవన్ మంజూరైనట్లు కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు తెలిపారు. ఐటీడీఏ ద్వారా భవన నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గిరిజన భవన్ మంజూరైనట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

చౌదరిగూడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం కొందుర్గు మండలం తంగేళ్లపల్లిలో 34 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. నాయకులు పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌గౌడ్, మల్లేష్ గౌడ్, నరేందర్, జీబీకృష్ణ, రాజేందర్‌గౌడ్ తదితరులున్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నదని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన బార్ద రాజేందర్ రెడ్డి కుమార్తె అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. బుధవారం ఎమ్మెల్యే శంకర్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4లక్షల ఎల్వోసీని ఇప్పించారు. రాయికల్ నాయకులు మామిడిపల్లి వెంకట్‌రెడ్డి, ఆశన్నగౌడ్, రాయికల్ శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, రాములుయాదవ్ తదితరులున్నారు.

'అంగన్‌వాడీ' స్థలాన్ని రక్షించాలి

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు బీసీ(గంగాభవాని) కాలనీలో అంగన్‌వాడీ భవనానికి కేటాయించిన స్థలాన్ని రక్షించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. కొందరు వ్యక్తులు స్థలాన్ని కబ్జాచేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళపల్లిలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి మాజీ ఎంపీటీసీ జంగయ్య, ఆలయ కమిటీ సభ్యులు భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణానికి విశ్రాంత ఉద్యోగి కొప్పు జంగయ్య రూ.50వేలు, పాపిశెట్టి రాము రూ.5వేలు, గ్రామస్థులు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణాన్ని త్వరగా చేపడుతామని వారు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పుల్లయ్య, యాదయ్య, కొప్పు చంద్రయ్య, నర్సింహ, తానయ్య, పర్వతాలు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందేలా కృషి

● ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల, కొంగరఖుర్దు(ఎ) సర్వే నంబర్ 73లో సుమారు 43 ఎకరాల అసైన్డ్ భూమిని రావిర్యాల దళిత రైతులు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్నారని, వారికి పరిహారం వచ్చేలా కృషి చేస్తానని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. 2009లో ప్రభుత్వం ఆ భూములను రైతులకు కేటాయించగా బుధవారం హౌసింగ్‌బోర్డు వారు పోలీసుల పహారాతో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నారు. దీంతో అధికారులకు, రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి వెళ్లి ఆ భూములను పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తుక్కుగూడ బీఆర్ఎస్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య, రైతులు పాల్గొన్నారు.

మోదీ 11 ఏళ్ల పాలనపై కార్యశాల

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై నేడు(గురువారం) ఆమనగల్లులో కార్యశాల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు లక్ష్మణ్‌లు తెలిపారు. సమావేశానికి ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ఆదిభట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి భరించలేక ఓ విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఆదిభట్ల మున్సిపల్ ఎంపీపటేల్‌గూడకు చెందిన గడుసు మైత్రి(20) ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. కొన్ని రోజులుగా కడుపు నొప్పితోపాటు చెవి నొప్పితో బాధపడుతోంది. బుధవారం కాలేజీకి వెళ్లకుండా ఇంటివద్దనే ఉంది. అయితే, కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మైత్రి సోదరుడు సాయికిరణ్ మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో బెడ్‌రూం తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉంది. 108 అంబులెన్స్‌లో వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా డ్యూటీలో ఉన్న డాక్టర్ పరిశీలించి మైత్రి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫోర్క్‌లిఫ్ట్ వాహనం ఢీకొని కార్మికుడి మృతి

షాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఫోర్క్‌లిఫ్ట్ వాహనం ఢీకొని కార్మికుడు మృతిచెందిన ఘటన చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో చోటుచేసుకున్నట్లు షాబాద్ ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలోని కుందన్ టెక్స్‌టైల్స్‌లో యూపీకి చెందిన ప్రమోద్‌కుమార్(35) స్టోరింగ్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కంపెనీలోని క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున వాష్‌రూంకు వెళ్తుండగా కంటైనర్‌లను లిఫ్ట్‌చేసే ట్రక్కు వాహనం(ఫోర్క్‌లిఫ్ట్) డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో అదుపుతప్పి ప్రమోద్‌కుమార్‌పై నుంచి వెళ్లింది. దాంతో అతడి కాలు విరిగింది. తోటి కార్మికులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పార్క్ చేసిన స్కూటీ క్షణాల్లో మాయం

● షాపులోకి వెళ్లి వచ్చేలోపే ఎత్తుకెళ్లిన దుండగుడు

● మరో రెండు చోట్ల 2 బైక్‌లు చోరీ

షాద్‌నగర్ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్కూటీ పార్కు చేసి కిరాణా షాపులోకి వెళ్లి సామగ్రి కొనుక్కొని వచ్చేలోపు దుండగుడు స్కూటీని దొంగిలించాడు. షాద్‌నగర్ పట్టణంలోని పరమేశ్వర టాకీస్ రోడ్డులో మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో భాగ్యనగర్ కాలనీలో నివాసముండే వానరాసి జగన్ అనే యువకుడు కిరాణా దుకాణం ముందు స్కూటీ పార్కు చేసి సామగ్రి కొనుగోలు చేసేందుకు షాపులోనికి వెళ్లాడు. అప్పుడే అక్కడికి వచ్చిన ఓ దొంగ స్కూటీ తాళం చెవిని గమనించి దొంగిలించాలని అనుకున్నాడు. దాంతో ముందుగా రెండు చక్కర్లు అటూ ఇటూ తిరిగాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదంతా అయిదు నిమిషాల్లోనే జరిగింది. అనంతరం జగన్ వచ్చి స్కూటీ కోసం చూస్తుండగా కనిపించలేదు. చోరీకి గురైనట్లు తెలుసుకొని అదే రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. అలాగే మంగళవారం రాత్రి టీచర్స్ కాలనీలో ఓ ఇంటి ముందు, పట్టణంలోని మరో జిమ్ ముందు నిలిపిన రెండు బైక్‌లను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు.

కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

కడ్తాల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలుపై రాష్ట్ర ప్రజల దృష్టి మళ్లించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు ప్రచారం కాళేశ్వరం కమిషన్ అని బీఆర్ఎస్ కడ్తాల మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. బుధవారం కడ్తాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని, లక్షల ఎకరాలకు సాగు, తాగు నీటిని అందించడానికి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులతో కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఆర్కే భవన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తూర్/శంషాబాద్ రూరల్/, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతు తెలిపేందుకు కొత్తూర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, ప్రజలు గమనిస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వై.రవీందర్‌యాదవ్, బి.దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, యుగంధర్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు. అలాగే బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి ఆదేశానుసారం శంషాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌కు బయలుదేరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ మల్కారం పీఏసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీశ్, శంషాబాద్ మున్సిపాలిటీ, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు బయలుదేరి వెళ్లారు. కాగా, కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి బీఆర్కే భవన్‌కు తరలివెళ్లారు. షాద్‌నగర్ నుంచి రవీందర్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో వెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

శంషాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడమే ధ్యేయమని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో శంషాబాద్ మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. లక్ష్మణ్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయని, స్కూళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు నిధులివ్వండి

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాన్‌పల్లి తండాలో ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తండా గిరిజనులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని కోరారు. బుధవారం తండా నాయకులు ఆమనగల్లు ఏఎంసీ వైస్‌చైర్మన్ కేశవులుతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, తండా నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



శంకర్‌పల్లి : రికార్డులను పరిశీలిస్తున్న ఏవో సురేష్‌బాబు

శంకర్‌పల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. శంకర్‌పల్లిలోని ఎరువుల దుకాణాల్లో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. వర్షాకాలంలో రైతులకు సరిపోను ఎరువులు అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు తప్పవని హెచ్చరించారు.